చార్మినార్‌లో బీజేపీని గెలిపించాలి

చార్మినార్: ఈ ఎన్నికల్లో చార్మినార్ నుంచి తనను తప్పకుండా తెలిపిస్తే..నియోజక వర్గం అభివృద్ధికి పాటుపడతానని చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘా రాణి స్థానిక ఓటర్లకు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె శనివారం పార్టీ అభిమానులు, కార్యకర్తలు,నాయకులతో కలిసి మొఘల్‌పురా,సుల్తాన్‌షాహీ,మీరాలం మండి తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు.

గెలిచిన వెంటనే స్లాట్‌హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గం నుండి భారీ మెజారిటీతో గెలుపొందిన వెంటనే జియాగూడ మేక లమండిని మోడ్రన్ స్లాటర్‌హౌస్‌గా నిర్మించడానికి శంకుస్థాపన చేస్తానని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలోని ఆరెకటిక భవనంలో ఆరెకటిక సూర్యవంశీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాను గత రెండు పర్యాయాలుగా కార్పొరేటర్‌గా పనిచేసిన సమయంలో మేకలమండి ఆధునీకరణ కోసం నిధులు మంజూరు చేయించానని ఆయన పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే గోషామహల్‌ను దత్తత తీసుకుంటా

రోడ్ షోలో మంత్రి కేటీఆర్




రోడ్ షోలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిషోర్‌వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: గోషామహల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను గెలిపిస్తే గోషామహల్‌ను దత్తత తీసుకుని గచ్చిబౌలి తరహాలో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని బేగంబజార్ ఛత్రి చౌరస్తాలో జరిగిన రోడ్‌షోలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. గత పదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజాసింగ్ భారతదేశాన్ని హిందూదేశంగా చేద్దామంటూ గోషామహల్‌ను గాలికి వదిలాడని పేర్కొన్నారు. గోషామహల్ అభివృద్ధికి తగినని నిధులు ఇచ్చి అభివృద్ధి చేస్తామని ఆయన ప్రకటించారు.

గచ్చిబౌలి తరహాలో గోషామహల్

బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను గెలిపిస్తే డిసెంబర్ 3వ తేదీ నాడే గోషామహల్‌ను దత్తత తీసుకుని గచ్చిబౌలి తరహాలో ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఉత్తర భారతీయ మార్వాడీ సమాజ్‌కు చెందిన నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను ఒక్కసారి మార్వాడీలు అందరూ కలిసి గెలిపించుకోవాలని సూచించారు. పాతబస్తీలో రంజాన్‌కు 24 గంటల పాటు ప్రభుత్వం అనుమతి ఎలా ఇచ్చిందో బీఆర్ఎస్ ప్రభుత్వం బేగం బజార్, ఫీల్‌ఖానా, మహారాజ్‌గంజ్, ఉస్మాన్‌గంజ్, అఫ్జల్‌గంజ్ వ్యాపార సంస్థలన్నీ 24 గంటల పాటు దీపావళి, దసరా వేడుకలకు తెరిచి ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. విరాట్‌కోహ్లి సెంచరీ కొట్టినట్లు బీఆర్ఎస్ రాష్ట్రంలో సెంచరీ కొట్టాలంటే నందుబిలాల్‌ను గోషామహల్‌లో గెలిపించాలన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న ఉస్మానియా ఆసుపత్రిని ఆధునీకరించి ఆధునాతన కొత్త ఆసుపత్రిగా నిర్మిస్తామని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిలు దాసోజు శ్రవణ్, కోలేటి దామోదర్ గుప్తా, జగన్మోహన్ రావు, మహ్మద్ వహీద్, మోతె శోభన్ రెడ్డి, ఆశిష్ కుమార్ యాదవ్, టీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఆనంద్ కుమార్ గౌడ్, పరమేశ్వరి సింగ్, పూజా బిలాల్, మమతా గుప్తా, సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



అబిడ్స్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: బీజేపీతోనే గోషామహల్ అభివృద్ధి జరిగిందని బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. అబిడ్స్, కట్టెలమండి, నాంపల్లి రోడ్డు, మహేష్‌నగర్, ఎంజేమార్కెట్, ప్రాంతాల్లో ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రచారం నిర్వహించారు. గత పదేళ్లలో రూ.500 కోట్లతో గోషామహల్ నలుమూలలా అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శంకర్ యాదవ్, లాల్‌సింగ్, రాకేష్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ పాదయాత్రకు బ్రహ్మరథం'



లంగర్‌హౌస్‌లో అమర్‌సింగ్ పాదయాత్ర

లంగర్‌హౌస్: కొందరు బీజేపీని మతతత్వ పార్టీ అని ముద్ర వేసి పబ్బం గడిపే ప్రయత్నాలు చేస్తున్నారని, ముస్లింలకు బీజేపీ చేసిన మేలును కొనియాడుతూ చేస్తున్న పాదయాత్రకు బ్రహ్మరథం పడుతున్నారని కార్వాన్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. శనివారం లంగర్‌హౌస్ వినాయక్‌నగర్‌లోని వినాయక దేవాలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడ నుండి పాదయాత్రగా వివిధ బస్తీల్లో తిరిగి ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డైరెక్టర్ జితేందర్ సింగ్

అబిడ్స్: విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యాసంస్థల డైరెక్టర్ జితేందర్ సింగ్ పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ధూల్‌పేట్‌లోని రిలయన్స్ హైటెక్ స్కూల్ ఆవరణలో విద్యార్థులకు కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఇతర పలు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులతో పాటు పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లను అందజేసి ప్రశంసించారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై తనిఖీ చేయించుకోవాలి



సూర్య ప్రకాశ్

చార్మినార్: చాంద్రాయణగుట్ట నియోజక వర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారం ఖర్చుల వివరాలను పోలింగ్ తేదీ కంటే ముందు మూడు సార్లు బండ్లగూడలోని తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేయించుకోవాలని నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, హైదరాబాద్ ఆర్డీఓ సూర్య ప్రకాష్ ఎన్నికల బరిలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులను కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నికల వ్యయ పరిశీలకుల పర్యవేక్షణలో ఈ నెల 19,24,29 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ తనిఖీ కొనసాగుతుందన్నారు. అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను వ్యక్తిగతంగానీ, ధృవీకరించిన తమ ఏజెంట్‌తో గానీ సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు.

గోషామహల్ చాక్నావాడిలో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదం దృశ్యం



మంటలు ఆర్పిన నర్సింగ్‌రావును ప్రశంసించిన నగర పోలీస్ కమీషనర్ సందీప్ శ్యాండిల్య

అబిడ్స్: గోషామహల్ చాక్నావాడిలో అగ్నిప్రమాదం సంభవించింది. శనివారం తెల్లవారుజామున ఉడ్ బీడింగ్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగినా పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన షాహినాయత్ గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సంభవించింది. ఇన్‌స్పెక్టర్ నాగరం రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.....తెల్లవారుజామున సుమారు రెండు గంటల సమయంలో ఉడ్ బీడింగ్ దుకాణంలో మంటలు చెలరేగడంతో స్థానిక షాపు యజమాని ఫిరోజ్ వెంటనే అక్కడికి చేరుకొని పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను ఆర్పివేశారు. పక్కనే ఉన్న కలప డిపోలకు మంటలు వ్యాపించి భారీ నష్టం జరిగి ఉండేదని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని పోలీసులు తెలిపారు. ఈ దుర్ఘటన సమయంలో విజయ డెయిరీకి చెందిన నర్సింగ్‌రావు అనే వ్యక్తి అప్రమత్తం కావడం వల్ల భారీ ప్రమాదం తప్పిందని తెలిపారు. బాధ్యతగల పౌరుడుగా నర్సింగ్‌రావు చేసిన కృషిని నగర పోలీస్ కమిషనర్ సందీప్ శ్యాండిల, డీసీపీ కవిత, ఏసీపీ, సీఐ తదితరులు అభినందించారు. నర్సింగ్‌రావు ఉత్తమ పౌరుడిగా పనిచేశారని ప్రశంసించారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛభారత్ అభియాన్



స్వచ్ఛ భారత్ అభియాన్‌లో డాక్టర్ మజహర్‌ఉల్లా తదితరులు

గోల్కొండ: ఆసుపత్రి సిబ్బందితో పాటు ఆసుపత్రికి వచ్చే పేషంట్లకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు స్వచ్ఛమైన గాలిని అందించడానికి నిరంతరం తాము కృషి చేస్తున్నామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్‌ఉల్లా అన్నారు. శనివారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి ఏఏవో, ఇన్‌చార్జీ ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాస్ రావు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద ఘటనలో అపార్ట్‌మెంట్ యజమాని అరెస్ట్

నాంపల్లి: ఇటీవల బజార్‌ఘాట్‌లో జరిగిన అగ్ని ప్రమాదం సంఘటనలో పది మంది మృతి చెందిన సంగతితెలిసిందే. ఈ ఘటనలో బాలాజీ అపార్ట్‌మెంట్ యజమాని రమేష్‌కుమార్ జైస్వాల్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపిన మేరకు.. బజార్‌ఘాట్‌లోని బాలాజీ అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 13న ఉదయం 9 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో అక్రమంగా ప్రమాదకరమైన కెమికల్స్‌ను నిల్వఉంచారు. భారీగా నిల్వ చేసిన కెమికల్ డ్రమ్ములకు మంటలు అంటుకుని 9 మంది సజీవ దహనమయ్యారు. అలాగే ఒకరు తీవ్ర గాయాలతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాదం సంభవించిన సమయంలో భవన యజమాని రమేష్ కుమార్ జైస్వాల్ అక్కడే ఉన్నారు. మంటలను ఆర్పే ప్రయత్నంలో కెమికల్ నుంచి వచ్చిన విషపూరితమైన వాయువులను పీల్చుకుని అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన అతడిని అంబులెన్స్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అస్వస్థత నుండి కోలుకున్న రమేష్‌కుమార్ జైస్వాల్‌ను శనివారం లక్డీకాపూల్‌లోని ఆసుపత్రికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ప్రమాదం జరిగిన రోజే అతడిపై కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన అతడిని రిమాండ్‌కు తరలించారు.

నేడు సీతారామ్‌బాగ్‌కు సద్గురు భూతేశ్వర్‌జీ రాక



అబిడ్స్: సీతారామ్‌బాగ్ ఆలయంలో కొనసాగుతున్న భారత భాగ్య సమృద్ధి యజ్ఞ కార్యక్రమానికి బృందావన్‌కు చెందిన సద్గురు భూతేశ్వర్ జీ గురూజీ ఈ నెల 19న రానున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు యజ్ఞశాలకు విచ్చేసి పూజలు చేస్తారని లతా మా ఫౌండేషన్ అధ్యక్షురాలు మాధవీ లత తెలిపారు.

బహదూర్‌పురాలో మజ్లిస్ అభ్యర్థి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంఐఎం అభ్యర్థి మహ్మద్ మోబిన్

బహదూర్‌పురా: బహదూర్‌పురా నియోజకవర్గంలో ఎంఐఎం అభ్యర్థి మహ్మద్ మోబిన్ శనివారం తీగలకుంటలో ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. స్థానికులు ఆయనకు స్వాగతిస్తూ పూలమాలతో సత్కరించారు. కార్పొరేటర్లు మహ్మద్ అనాస్, ఖాదర్, మోతిలాల్ నాయక్, ముక్తాధర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20, 24, 27 తేదీల్లో ఎన్నికల ఖర్చుల తనిఖీలు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులను మూడు దఫాలుగా తనిఖీలు చేయనున్నట్లు రిటర్నింగ్ అధికారి విక్టర్ తెలిపారు. ఈ నెల 20, 24, 27 తేదీల్లో గోషామహల్ నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయంలో అభ్యర్థులు తమ ఖర్చులను తమ అధికారులకు చూపించాలని ఆయన వెల్లడించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుల ఆధ్వర్యంలో అభ్యర్థుల ఖర్చులను తనిఖీలు చేపడతామన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన డీసీపీ

గోల్కొండ: సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ బి.బాలస్వామి శనివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటైన పోలింగ్ స్టేషన్‌లను వాటి పరిసరాలను ఆయన పరిశీలించారు. గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



గోల్కొండ: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటింగ్ జరిగే రోజు ఓటు వేయాలని మజ్లిస్ సీనియర్ నాయకులు ఆలీముద్దీన్ అన్నారు. శనివారం ఆయన ఓటు హక్కు వినియోగించడంపై జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా భారతీయులందరు ఓటు హక్కును పొందారని ఆయన అన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

నాంపల్లి: రైలు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందారు. ఈ సంఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి బోరబండ–హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన విజయపురి ప్యాసింజరు రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపైన నలుపు, నీలం రంగు గళ్ల చొక్కా, నీలం రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు చేసిందేమీ లేదు..

అక్బరుద్దీన్ ఓవైసీ

యాకుత్‌పురా: ముస్లిం ప్రజల సంక్షేమానికి నిరంతరం పోరడుతున్న తమ పార్టీకి ప్రజలు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని మజ్లిస్ పార్టీ శాసనసభా పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శక్రవారం రాత్రి యాకుత్‌పురా నియోజకవర్గం పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే జఫర్ హుస్సెన్ మేరాజ్ ఆధ్వర్యంలో భవానీనగర్‌లో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తలాబ్ కట్టా ప్రాంతానికి తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. ఎన్నికలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు ముస్లింపై కపట ప్రేమ చూపుతున్నారన్నారు. రాహుల్ గాంధీకి అంత ప్రేమ భిమానాలుంటే ముందు వారి చిన్నమ్మ మేనకా గాంధీ, తమ్ముడు వరుణ్ గాంధీలను తమ ఇంటికి తెచ్చుకోవాలని మర్శించారు. ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, పార్టీ యాకుత్‌పురా ఇన్‌ఛార్జీ యాసర్ అరఫత్ పాల్గొన్నారు.

కార్వాన్‌లో కాంగ్రెస్ నేతల పాదయాత్ర



పాదయాత్రలో కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ ఆజీరి

గోల్కొండ: కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ ఆజీరి అన్నారు. శనివారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలో పాదయాత్ర చేశారు. మజ్లిస్, బీజేపీ నుంచి కార్వాన్‌ను రక్షించాలంటే తనను గెలిపించాలని ఆయన కోరారు.

చార్మినార్‌లో బీఆర్ఎస్ బైక్ ర్యాలీ

చార్మినార్: చార్మినార్ నియోజక వర్గంలో ఈసారి తన విజయం సునాయాసంగా మారనుందని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన తన అనుచరులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి నియోజక వర్గంలోని పలు ప్రాంతాలలో శనివారం బైక్ ర్యాలీల నిర్వహించి ఈ ఎన్నికలలో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ

నాంపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం



ఆసిఫ్‌నగర్ నాయకులతో సమావేశమైన సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్

విజయనగర్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో తెలంగాణలోని ప్రతి కుటుంబం ఏదో ఒక విధంగా లబ్ధిపొందుతోందని బీఆర్ఎస్ నాంపల్లి అభ్యర్థి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్, జేబాబాగ్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో ఆయన వెంట పార్టీ కో ఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్ అగర్వాల్, మెట్టు నట్రాజ్ పాల్గొన్నారు.

కార్వాన్‌లో హ్యాట్రిక్ సాధిస్తా : ఎమ్మెల్యే కౌసర్



ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానించిన సంఘ సేవకుడు రాజేందర్ పరిషాద్ జైస్వాల్

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో 3వ సారి అఖండ విజయం సాధించి హ్యాట్రిక్ చేస్తానని కార్వాన్ నియోజకవర్గం ఎంఐఎం అభ్యర్థి కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలోని ఇక్బాల్‌గంజ్, మిట్టిషాబాగ్, బడా బండ, పురానాపూల్, అర్జున్‌గల్లీ, భీంనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. నగరంలోని అన్ని నియోజకవర్గాల కంటే కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పాటుపడ్డానన్నారు.

గౌలిపురాలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి కె.రవిరాజ్

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని సీబీఐ క్వార్టర్స్, గౌలిపురా మార్కెట్ తదితర ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం యాకుత్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.రవిరాజ్ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మండి బిర్యానీ తిని 30 మందికి ఫుడ్ పాయిజన్



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

చార్మినార్: పాతబస్తీ పురానిహవేలీలోని ఓ హోటల్‌లో మండి బిర్యానీ తిన్న దాదాపు 30 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం రాత్రి కొంత మంది పురానీహవేలీలోని ఎమ్మెస్ మండి బిర్యానీ హోటల్‌లో వివిధ సమయాల్లో తిన్నారు. కొంత మంది శుభకార్యాల కారణంగా కూడా పార్సిల్ సైతం తీసుకు వెళ్లారు. ఇలా ఈ హోటల్‌లో బిర్యాని తిన్న వారు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారు. వెంటనే వారి కుటుంబ సభ్యులు బాధితులను నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహిస్తుండగా..మరి కొంత మంది నూర్ఖాన్ బజార్ లోని జాఫ్రియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫుడ్ పాయిజన్‌కు గురైన బాధితుల కుటుంబ సభ్యులు శనివారం సంబంధిత మీర్ చౌక్ పోలీసులతో పాటు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు సమాచారాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులకు అందజేశారు. బాధితులు, పోలీసుల ఫిర్యాదు మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటల్ కు చేరుకొని ఆహార పదార్థాలను సేకరించి ల్యాబ్ కు తరలించారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల నివేదిక మేరకు తగిన చర్యలు తీసుకుంటామని మీర్ చౌక్ ఏసిపి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే గోషామహల్ అభివృద్ధి



ప్రచారం నిర్వహిస్తున్న పూజవ్యాస్ బిలాల్

అబిడ్స్: బీఆర్ఎస్‌ను గెలిపిస్తే గోషామహల్ నియోజకవర్గం గ్రేటర్‌లోనే అభివృద్ధిలో నెంబర్ వన్ నియోజకవర్గంగా రూపొందుతుందని బేగంబజార్ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పూజ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. జుమ్మెరాత్ బజార్, చుడిబజార్, గౌలివాడ, జిన్సీచౌరాహి వరకు ఆమె తల్లి ఉమాదేవి వ్యాస్‌తో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. తన తండ్రి బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ 25 సంవత్సరాలకు పైగా నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని వివరించారు.

కాంగ్రెస్‌కు అండగా నిలబడాలి

చాంద్రాయణగుట్ట: నియోజకవర్గం అభివృద్ధి కోసం తనను గెలిపించాలని చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ అభ్యర్థి బోయ నగేష్ అన్నారు. నియోజకవర్గంలోని పలు ముస్లిం బస్తీలలో శనివారం ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించి హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ అధికారం పట్టం కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

గోల్కొండ: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. శనివారం కార్వాన్ బాంజావాడిలో కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల వల్ల లక్షలాది కుటుంబాలకు మేలు చేకూరుతుందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీకి పోటీలో నిలబెట్టడానికి అభ్యర్థులే దొరకడం లేదని ఆయన విమర్శించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ ఏ–బ్లాక్ ఉపాధ్యక్షుడిగా శివలాల్‌ను నియమిస్తు నియామక పత్రాన్ని అందజేశారు.

కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వండి



ప్రచారంలో పాల్గొన్న చార్మినార్ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ముజీబుల్లా

చార్మినార్: పాతబస్తీలో ముస్లిం ప్రజలను గత కొంత కాలంగా మజ్లిస్ పార్టీ మోసం చేస్తోందని చార్మినార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ అన్నారు. గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్‌తో కలిసి ఆయన శనివారం లాల్‌దర్వాజ మోడ్ తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. చార్మినార్ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని స్థానిక ఓటర్లను కోరారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది

గోల్కొండ: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్ నియోజకవర్గం గుడిమల్కాపూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో కుటుంబ పాలనకు అవకాశం లేదని కేవలం అవినీతి అంతం చేయడమే బీజేపీ లక్ష్యమని ఆయన అన్నారు. తెలంగాణలో అవినీతి మితిమీరిపోయిందని స్వయంగా బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులే అవినీతికి తెరలేపారని ఆయన అన్నారు. తెలంగాణ అంటే కుటుంబ పాలన రాష్ట్రంగా మారిందని అన్నారు. మరోవైపు దేశాన్ని తన పాలనలో అగ్రరాజ్యంగా నిలిపిన ఘనత ప్రధాని మోదీని అని ఆయన అన్నారు. టి.అమర్‌సింగ్‌ను గెలిపించి బీజేపీని గెలిపించాలని ఆయన కోరు. ఆయన వెంట బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్, డిజ్జర్‌సింగ్, సునీల్‌యాదవ్, ఇంద్రసేనారెడ్డి తదితరులున్నారు.